క్లుప్తంగా

బూదగవి సూర్యభగవాన్‌కు విశేష పూజలు



అలంకరణలో బూదగవి సూర్యభగవాన్ మూలవిరాట్

ఉరవకొండ: మండలంలోని ప్రసిద్ధి చెందిన బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగహారతి, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారికి క్షీరాభిషేకం చేయించారు.

దళితులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: దళితులపై దాడిచేసిన వారిపై వెంటనే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. శెట్టూరు మండలంలోని మాకొడికి గ్రామంలో రెండురోజుల క్రితం మొహర్రం వేడుకల్లో దళిత కుటుంబాలకు చెందిన వారు గుడిలోకి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లారని, దీంతో అదేగ్రామానికి చెందిన పొన్నూరు స్వామి, గోవిందప్ప, రామాంజనేయులు దళితుడు గంగాధర్, మహిళలపై దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిన దళితులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ తాలుక అధ్యక్షుడు చెలిమప్ప, ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు రామన్న, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెబాట



విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాయదుర్గంటౌన్: రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా రాయదుర్గం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మెబాట పట్టారు. విధులు బహిష్కరించి సీఐటీయూ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ముందు మొదటి రోజు నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీవో 36 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేయాలన్న నిర్ణయం ఉపసంహరించుకుని కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలనిన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీతకు సన్మానం



సీఎస్ఐ చర్చిలో సర్పంచ్ మోనాలీసాను సత్కరిస్తున్న చర్చి పాస్టర్, కమిటీ సభ్యులు

ఉరవకొండ: స్థానిక సీఎస్ఐ చర్చిలో వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలీసాకు చర్చి పాస్టర్ ప్రమీలాజోసఫ్, చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఇటీవల సర్పంచ్ మోనాలీసా ఢిల్లీలో శిక్షణ విజయవంతంగా ముగించుకొని ఉత్తమ ఫర్ఫార్మెన్స్ అవార్డు పొందిదారు. సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సర్పంచ్‌తో పాటు ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకులు రాజును సన్మానించారు. కమిటీ సభ్యులు జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఏసీ పవన్, షాహిన్, సాకేభాస్కర్, మీనుగ భాస్కర్, లాలు, సోము పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం జర్నలిస్ట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికైంది. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా మస్తాన్, ఉపాధ్యక్షుడిగా లోకేష్, కార్యదర్శిగా ఎరడికెర వన్నూరుస్వామి, ప్రధాన కార్యదర్శులుగా వినోద్, మల్లికార్జున , సహాయ కార్యదర్శిగా రంగస్వామి, కోశాధికారిగా షఫీ, సహాయ కోశాధికారిగా బండి సుధ, కార్యవర్గ సభ్యులుగా షాబ్జాన్, పూజారి తిమ్మప్ప, రాజేశ్, జీఎస్టీఆర్ ప్రసాద్‌ను ఎంపిక చేశారు. అంతకు ముందు సీనియర్ పాత్రికేయులు గౌరవ అధ్యక్షుడు లింగప్రసాద్, కోదండలను కమిటీ సభ్యులు సన్మానించారు.

వర్షం కురవక.. ఖరీఫ్ సాగక

- మేఘాలు కమ్ముకుంటున్నా చినుకు జాడలేదు
- అయోమయంలో అన్నదాతలు
- వేరుశనగ సాగుకు గడువు ముగుస్తుందని ఆందోళన



ఆమిద్యాలలో రచ్చబండపై రైతులు



వేరుశనగ విత్తుకు నేలను దుక్కి చేసి సిద్ధంగా ఉంచిన దృశ్యం

రాయదుర్గం/ఉరవకొండ రూరల్/కూడేరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రెండు నెలలుగా అదనులో పదును కాక సాగు ప్రశ్నార్థకమైంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం.. ఆ తర్వాత ఆవిరి కావడంతో రైతన్నలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. అప్పు చేసి పొలాలు, విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. వర్షం ఎప్పుడు పడుతుందో.. పొలాల్లో విత్తనం ఎప్పుడు వేయాలో అని ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది వాతావరణం అనుకూలించడంతో జూలై మొదటి వారం నాటికి 90 శాతం సాగు పూర్తయ్యింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా విత్తనం పడలేదు. మూడు నియోజకవర్గాల్లోనూ 2,90,473 హెక్టార్లు సాధరణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 2,44,517 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ లెక్కలు చెప్తున్నాయి. ఇప్పటి దాకా 20 శాతం సాగు పూర్తి కాలేదు. దీంతో ఖరీఫ్‌లో ప్రధాన పంటగా చెప్పుకునే వేరుశనగ విత్తనం ఇళ్లల్లోనే నిల్వ ఉండిపోయింది. ఈ ఏడాది అకాల వర్షాలకు తోడు నైరుతి రుతు పవనాలు ముందే పలకరించాయి. ఖరీఫ్ కంటే ముందే భారీ వర్షాలు కురిశాయి. అసలు సమయంలో ముసుగేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా మంది ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. వేరుశనగ కాకుండా కంది, ఆముదం, సజ్జ, జొన్న పంటల సాగు విస్తీర్ణం పెంచుతున్నారు.

పెట్టుబడుల కోసం అప్పులు

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో అందిస్తామన్న నగదు కేంద్రం నుంచి రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14 వేలు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. పంట సాగు, కోత సమయంలో పెట్టుబడి కోసం వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లు రైతు భరోసా పథకం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.13,500 అందించారు. 13 నెలలు గడిచినా కనీసం పైసా కూడా రైతు ఖాతాలో జమ కాలేదు. కొత్తగా ఏదైనా అమలులోకి తెచ్చి ఆదుకున్నారంటే అదీలేదు. పల్లెల్లో పనులు లేక రైతులు ఉదయం, సాయంత్రం సమయాల్లో చెట్ల కింద, రచ్చ బండల వద్ద, ఆలయాల వద్ద ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది.

విత్తనాలు అమ్ముకునేందుకు సిద్ధం..

వ్యయ ప్రయాసలకోర్చి రెండు నెలల ముందే వేరుశనగ విత్తనాన్ని రైతులు సిద్ధం చేసుకున్నారు. సరైన వర్షాలు కురవక, విత్తనాలు పడక ఇళ్లకే పరిమితం చేశారు. సాధరణంగా జూలై 15 లోపు వేరుశనగ విత్తుకోవడం ఆనవాయితీ. గడువు గండం తరుముకొచ్చినా వరుణుడు కరుణించలేదు. దీంతో దిక్కుతోచక చాలా మంది రైతులు అందినకాడికి విత్తనాలు అమ్ముకుంటున్నారు. బ్యాంకుల్లోనూ వేరుశనగకు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టించుకోలేదు. దీంతో బలవంతంగా విత్తుకున్న పంట దెబ్బతింటే బీమా వస్తుందో? రాదో?నన్న బెంగతో చాలా మంది ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. ఖరీఫ్‌లో ఇలాంటి దారుణ పరిస్థితులు పదేళ్ల క్రితం చూశామని రైతులు అంటున్నారు.

సగం సాగు దాటలేదు



వర్షాలు సక్రమంగా కురవక 'ఖరీఫ్' విత్తన సాగు ముందుకు సాగలేదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు గత పదేళ్ల క్రితం చూశాం. చాలా మంది రైతులు వేరుశనగకు బదులు కంది, ఆముదం విత్తుకుంటున్నారు. వర్షాలు పడకపోతే రైతులు దారుణ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికే అరకొర తేమలో విత్తిన పొలాలు మొలక దశలోనే వాడుముఖం పట్టాయి. అసలైన కార్తెల్లో చిరుజల్లులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రైతుల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. **హరినాథ్‌రెడ్డి, రైతు,, ఆర్ కొత్తపల్లి**

విత్తుకు సమయం ఉంది

వేరుశనగ విత్తుకోవడానికి ఈ నెల ఆఖరి వరకు సమయం ఉంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి పంటలు వాడుముఖం పట్టాయోకాని ఎక్కడా ఎండిపోలేదు. చిరుజల్లులు ఆదుకుంటున్నాయి. కంది, ఆముదం సాగు విస్తీర్ణం పెరుగుతోంది. **– పద్మజ, ఏడీఏ, రాయదుర్గం**

సేంద్రియం..పుడమికి బలం



వజ్రకరూరు వద్ద పొలంలో తోలిన పశువుల పేడ



బెళుగుప్ప సమీపంలో పొలంలో నిలిపిన గొర్రెల మంద

- పశువుల పేడతో పోషకాల శాతం అధికం
- భూసారం పెరిగి, ఆశించిన స్థాయిలో దిగుబడులు

ఉరవకొండ: సేంద్రియ ఎరువులు పడమికి బలం అని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పంటకు ప్రయోజనంతో పాటు పెట్టుబడులు తగ్గి దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని చెప్తున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూమిలో పోషకాల శాతం, భూసారం పెరుగుతుందంటున్నారు. రైతులు పశువుల పేడను పొలాల్లోకి తోలుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. గొర్రెల మందను పొలాల్లో ఆపి ఉంచుతున్నారు. మొదట దశలో పశువుల పేడను వేసుకుంటే పంట దిగుబడికి దోహద పడుతుంది. పొలాల్లో ఎరువులు చల్లి దుక్కులు దున్నుకుంటే పైరు ఎదుగుదల బాగుంటుంది. వీలైనంత ఎక్కవగా పేడ వేయడం వల్ల సహజ సిద్ధ లవణాలు పంటకు దోహదపడుతాయి. భూమిలో ఉన్న ఆమ్ల, క్షార స్థాయిని నిలబెడతాయి. నేలలో సూక్ష్మజీవుల వృద్ధికి తోడ్పడుతుంది. ఇవి పంటకు ఎంతో మేలు చేస్తాయి. పంటలకు ప్రధానంగా నత్రజని, భాస్వరం, పొటాష్ అవసరం కాబట్టి ఈవిధానాన్ని రైతులు తప్పగా పాటించే పనిలో పడ్డారు.

సేంద్రియ ఎరువులు వాడాలి



సేంద్రియ ఎరువుల వినియోగానికి రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సేంద్రియ ఎరువుల వాడకం పెరిగితే భూమిలో పోషకాల శాతం పెరుగుతుంది. పెట్టుబడి భారం తగ్గుతుంది. దిగుబడులు కుడా ఆశించిన స్థాయిలో ఉంటాయి.
– రామకృష్ణుడు, ఏఓ, ఉరవకొండ

హెచ్చెల్సీ పైపులైన్ లీకేజీతో నీరు వృథా

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం పంపింగ్ పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి రాయదుర్గానికి ఫిల్టరేషన్ పాయింట్ వరకు అడుగడుగునా లీకేజీతో భారీ స్థాయిలో నీరు (రా వాటర్) వృథా అవుతోంది. ఈ మార్గంలో దాదాపు 10కిపైగా లీకేజీలు ఉన్నాయి. వీటిలో నాలుగు చోట్ల భారీ స్థాయిలో లీకేజీ ఏర్పడి పెద్ద ఎత్తున వృథా అవుతోంది. కొంతానపల్లి గేటు వద్ద, కణేకల్లు క్రాస్ అగ్రికల్చర్ కాంప్లెక్స్ ఎదురుగా, నల్లంపల్లి వద్ద, క్రాసింగ్ ఏరియాలోని రేణుక ఎల్లమ్మగుడి వద్ద భారీ లీకేజీలు ఉన్నాయి. అంతేకాక పట్టణ పరిధిలో కూడా నాలుగైదు చోట్ల లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. క్షేత్రస్థాయిలో లీకేజీలు అరికట్టడంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు అలసత్వం వహిస్తుండడంతో నీటి వృథా అవుతోంది. మరోవైపు హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు విడుదల చేసిన నేపథ్యంలో మరో వారంరోజుల్లోపు కెనాల్ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని లీకేజీల మరమ్మతులు చేయిస్తే నీటి వృథాను అరికట్టొచ్చు. ఈ విషయమై మున్సిపల్ మున్సిపల్ డీఈ పొరాళ్ల సురేష్‌ను వివరణ కోరగా, దశల వారీగా లీకేజీల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఫిల్టరేషన్ పాయింట్ వరకు లీకేజీల మరమ్మతులకు ప్రత్యేక నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.



కొంతానపల్లి వద్ద పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు పక్కన నిలిచిన నీరు

చిన్నపీర్ల పండుగకు కొలువుదీరిన పీర్లు



జయపురంలో గుండం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పీర్ల దేవుళ్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్నపీర్ల (కొడి) వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పెద్ద మొహ్రరం అనంతరం చిన్న మొహ్రరం వేడుకలు నిర్వహించడం ఇక్కడ ఆనాయితీ. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరాయి. కొడిపీర్ల ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లచావిడిల్లో ప్రత్యేక ఫాతెహా పఠించారు. కొడిపీర్ల వేడుకల్లో భాగంగా ఈ నెల 15న కొడీపీర్ల పెద్ద సరిగెత్తు, పానకాల సమర్పణ, 16న కోట ఏరియాలో పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



కురాకులగుట్ట హుస్సేన్ హుస్సేన్ పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

జయపురలో ముగిసిన పీర్ల పండగ

కూడేరు: మండలంలోని జయపురంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పీర్ల జలధి కార్యక్రమంలో వేడుకలు ముగిశాయి. పీర్ల జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున వన్నూరుస్వామి, కుళ్లాయిస్వామి సర్దానప్ప, సర్కార్ పీర్ల దేవుళ్లు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం పీర్ల చావిడి నుంచి పీర్లను మంగళ వాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

'రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది'

వజ్రకరూరు: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని చాబాలలో సర్పంచు మల్లెల జగదీష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చక్రిస్వామి, తలారి చెన్నప్ప, కురుబ అంజనప్ప తదితరులు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలో బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై జరిగిన దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా కేవలం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కా ర్యకర్తలే టార్గెట్‌గా చేసుకుని వారిపై అక్రమ కేసులు నమోదుచేస్తూ భయభ్రా ంతు లకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమి పాలన– మోసాలను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నట్లు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. తల్లికి వందనం పథకంలోనూ నిబంధనలు అధికంగా ఉండడంతో చాలా మంది తల్లుల ఖాతాలకు డబ్బు జమ కాలేదన్నారు. ఖరీఫ్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. అన్నదాత సుఖీభవ అమలు కాలేదన్నారు. పంట పెట్టుబడికి డబ్బులు లేక రైతులు దిక్కులు చూస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెప్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇప్పటికే రైతులకు రైతుభరోసాతోపాటు అనే క పథకాలు అమలు చేసి ప్రజలకు అందించారని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాజీ ఎమ్మెల్యే చిన్నపరెడ్డి సేవలు చిరస్మరణీయం

కణేకల్లు: మాజీ ఎమ్మెల్యే చిన్నపరెడ్డి సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. ఆదివారం కణేకల్లులో మాజీ ఎమ్మెల్యే లక్కా చిన్నపరెడ్డి వర్ధంతిని పలువురు విశ్రాంతి ఉద్యోగులు, ప్రముఖులు, రైతులు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూజలు జరిపించారు. పీఏసీఎస్ విశ్రాంత సీఈఓ కృష్ణారెడ్డి, విశ్రాంతి మున్సిపల్ కమిషనర్ అయోధ్య రామిరెడ్డి, డాక్టర్ సోమన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, కణేకల్లు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి తోపాటు పలువురు మాజీ ఎమ్మెల్యేకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. కణేకల్లు, బొమ్మనహాళ్ ప్రాంతాలు తుంగభద్ర జలాలతో పచ్చగా, సస్యశ్యామలంతో ఉన్నాయంటే అది మాజీ ఎమ్మెల్యే, కణేకల్లువాసి లక్కా చిన్నపరెడ్డి చలువేనని పేర్కొన్నారు. కణేకల్లు ప్రాంతానికి చిన్నపరెడ్డి ఎంతో సేవ చేశారన్నారు.



మాజీ ఎమ్మెల్యే లక్కా చిన్నపరెడ్డికి నివాళులర్పిస్తున్న విశ్రాంతి ఉద్యోగులు, ప్రముఖులు

ఏపీకే ఫైల్స్.. అప్రమత్తంగా ఉండాలి గురూ

బొమ్మనహాళ్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏపీకే ఫైల్స్, లింకులను ఎవరూ ఓపెన్ చేయడంగానీ డౌన్‌లోడ్ చేయరాదని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వీటిని క్లిక్ చేస్తే ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింక్‌లు, డాక్యుమెంట్లు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయొద్దన్నారు. ఫోన్‌లను హ్యాక్ చేసి వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ డేటా, ఫొటోలు, డాక్యుమెంట్లను తస్కరించి, ఆర్థికంగా నష్టం కలిగిస్తారని తెలిపారు. కొద్దిరోజులుగా అన్ని వాట్సాప్ గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్, లింకులు ఎక్కువగా వస్తున్నాయని, చాలా మంది మొబైళ్ల హ్యాకింగ్ అవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మోసాలు ఎలా చేస్తారంటే :

- నిందితులు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, మేసేంజర్ , ఇన్‌స్టాగామ్, ఎస్ఎంఎస్ ద్వారా లింక్ పంపుతారు.
- డెలివరీ బాయ్, రీఫండ్ లింక్, డిజిటల్ కేవైసీ, రివార్డ్స్ అప్డేట్, షీగిఫ్ట్ , అరెండ్ డాక్యుమెంట్, ఈ–చలానా పేర్లతో లింక్‌ల ద్వారా ఆకర్షిస్తారు.
- పీఎం కిసాన్, ఎస్‌బీఐ, కెనరా తదితర బ్యాంకుల పేర్లతో ఏపీకే లింకులు వాట్సాప్ గ్రూప్‌ల్లో ఎక్కువగా వస్తున్నాయి.
- ఆ లింకు ద్వారా ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అవుతుంది. దీన్ని యాప్ అనుకొని ఇన్‌స్టాల్ చేయరాదు.
- ఆ యాప్ అనుమతులు అడుగుతుంది. ఎస్ఎంఎస్, కాంటాక్ట్స్, కాల్ లాగ్, స్టోరేజీ, నోటిఫికేషన్స్, యాక్సెసబిలిటీ ద్వారా ఆకర్షిస్తున్నారు.
- ఫోన్‌లోని ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, క్రెడిట్, డెబిట్ కార్డు సమాచారం నేరుగా నిందితులకు అందుతుంది.
- కొన్నిసార్లు యూపీఐ యాప్‌లను కూడా యాక్సెస్ చేసి ఖాతాల్లోని డబ్బు దొంగిలిస్తారు.
- కొన్ని సందర్భాల్లో ఫోన్ కెమెరా, మైక్ యాక్సెస్ చేసి వ్యక్తిగత వీడియోలు, ఆడియోలు సేకరించి బ్లాక్ మెయిల్‌కు ప్రయత్నిస్తారు.

పోలీసుల సూచనలు :

- ప్లేస్టోర్ తప్పా మరో వేదికల నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేయరాదు.
- గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులు, డాక్యుమెంట్లు, ఏపీకే ఫైల్‌లు ఓపెన్ చేయవద్దు.
- ఫోన్‌లోని ప్రతి యాప్‌కు ఇచ్చే అనుమతులను అప్రమత్తంగా పరిశీలించాలి.
- బ్యాంకు అకౌంట్, యూపీఐ కార్డు వివరాలను ఎవతోనూ పంచుకోవద్దు.
- ఫోన్‌లో అనుమానాస్పద యాప్ ఇన్‌స్టాల్ చేసినట్లయితే వెంటనే ఆ యాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయాలి.
- మొబైల్‌ను రీసెట్ చేసి, ట్రస్ట్ చేసిన యాప్‌లను మాత్రమే తిరిగి ఇన్‌స్టాల్ చేయాలి.

మోసానికి గురైన వారు చేయాల్సింది ఇలా..

- తక్షణం జాతీయ సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి.
- www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.

గాలీవానకు నేలమట్టమైన బీర తోట



ఎర్రంపల్లి గ్రామంలో గాలీవానకు నేలమట్టమైన బీర తోట

కళ్యాణదుర్గం రూరల్: ఎంతో కష్టపడి సాగు చేసిన బీర తోట చేతికందివచ్చిన సమయంలో గాలీవానకు నేలమట్టమైంది.మండలంలోని ఎర్రంపల్లికి చెందిన మారుతి తనకున్న రెండెకరాల్లో బీర సాగుకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టారు. పంట కాతకు వచ్చింది. మొదటి సారి పంటను కోశాడు. రెండోకోత సమయంలో ఆదివారం కురిసిన వర్షానికి బీర తోట పందిరి మొత్తం నేలమట్టమైంది. పంట చేతికందిన సమయంలో మొత్తం నేలమట్టం కావడంతో రైతు మారుతీ నష్టపోయాడు.

అట్టహాసంగా లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ఉరవకొండ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న క్లబ్ గవర్నర్

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్లబ్ నూనత కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా వేదమూర్తి, కోశాధికారిగా డాక్టర్ హర్షవర్ధన్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విరుపాక్ష హాజరై నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఉరవకొండ లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. ఉరవకొండ క్లబ్‌లో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి వారు కంటి పరీక్షల కేంద్రం నిరంతరంగా కొనసాగుతోందన్నారు. క్లబ్ నూతన అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు జాబీర్, గణేష్‌బాబు, నూర్‌మహ్మద్, ఎంసీ నాగభూషణం, బాలచంద్ర, జీకే శ్రీధర్, ప్రభాకర్‌నాయుడు, సప్తగిరిమల్లి, విశ్వనాథ్, వెంకటేష్, సత్తెన్న పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా బస్‌షెల్టర్



బస్‌షెల్టర్ వద్ద నెలకొన్న అపరిశుభ్రత

ఉరవకొండ రూరల్: మండలం పరిధిలోని పెద్దముష్టూరు వద్ద ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న బస్‌షెల్టర్ వద్ద అపరిశుభ్రత నెలకొంది. బస్‌షెల్టర్ ముందు కంప చెట్లు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ వద్ద పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు!



కేరమ్మకట్టకు వెళ్లే దారిలో డ్రైనేజీ పైప్ కోసం తవ్వి వదిలిన గుంత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వార్డుల్లోని ఇంటి యజమానులు తాగునీటి కొళాయి పైప్‌లైన్‌లు, డ్రైనేజీ పైప్‌లైన్ కోసం సీసీ రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. దీంతో వీధుల్లో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలకు సైతం గురవుతున్నట్లు పలువురు వాపోతున్నారు. పట్టణంలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది గానీ, సచివాలయ సిబ్బంది గానీ పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా సీసీ రోడ్లను ధ్వంసం చేస్తున్నారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరిస్వా మి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో స్వామికి ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేషపూజలు చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.